## క్లుప్తంగా

### ఆర్థిక సాయం



వాజేడు: మండల పరిధిలోని సుందరయ్య కాలనీకి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు అక్కి శెట్టి ఏసు అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం నిర్వహించిన దశదిన కర్మ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెనుమల్ల కృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు రూ.8వేలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పాయం జానకి రమణ, లక్ష్మీనారాయణ, గిరిబాబు, నాగరాజు, ముత్తయ్య, కేదారేశ్వర్, శ్రీను తదితరులు ఉన్నారు.

### వ్యక్తి ఆత్మహత్యాయత్నం



వాజేడు: మండల పరిధిలోని బొల్లారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మద్యం మత్తులో ఉరి వేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. శనివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లారం గ్రామానికి చెందిన కుర్సం సోమరాజు మద్యం మత్తులో నిత్యం కుటుంబ సభ్యులతో గొడవ పడుతుండేవాడు. ఈక్రమంలో శనివారం మద్యం సేవించొద్దని కుటుంబ సభ్యులు మందలించడంతో మద్యం మత్తులో ఉరివేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. దీంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో వెంకటాపురం వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

### గ్రామాల్లో ఫీవర్ సర్వే

కన్నాయిగూడెం: మండలంలో వైద్య సిబ్బంది ఆరోగ్య కేంద్రంలో ఫీవర్ సర్వే చేపట్టారు. శనివారం డాక్టర్ అభినవ్ ఆధ్వర్యంలో సిబ్బంది సర్వాయి, చింతగూడెం, గొత్తికోయ గ్రామాల్లో మలేరియా, ఫీవర్ సర్వే చేశారు. సర్వేలో భాగంగా మలేరియాకు చెందిన లార్వాలను గుర్తించినట్లు తెలిపారు. ఇంటి పరిసరాల్లో దోమలు నిల్వ ఉండేందుక ఉనువైన మురుగు నీటిని తొలగించినట్లు అసిస్టెంట్ డైరెక్టర్ నాగయ్య తెలిపారు. ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి అజయ్ కుమార్, నర్సింహారావు, ల్యాబ్ టెక్నీషియన్ మురళి, హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్, ఏఎన్ఎం ఊర్మిల, తదితరులు పాల్గొన్నారు

### ప్రమాణ స్వీకారం



వెంకటాపురం(కె): నూగూరు వ్యవసాయ కమిటీ డైరెక్టర్లుగా మండలానికి చెందిన యాలం సాయి, పాయం వెంకట్రామయ్య ఎన్నికయ్యారు. కాగా శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాయలంలో వీరు ప్రమాణ స్వీకారం చేశారు.

### గుడుంబా తాగి యువకుడి మృతి

కన్నాయగూడెం : గుడుంబా తాగి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని సర్వాయిలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నల్లెబోయిన ప్రభాకర్ (29) కొంతకాలంగా గుడుంబాకు బానిసయ్యాడు. నిత్యం గుడుంబా తాగుతూ అనారోగ్యానికి గురయ్యాడు. అయినా మానకుండా తాగుతూ శుక్రవారం మృతి చెందాడు. కాగా, అదే గ్రామంలో మరో వ్యక్తి కూడా గుడుంబా తాగి మృతి చెందినట్లు వారు తెలిపారు. మండలంలో గుడుంబా ఏరులై పారుతోందన్నారు. దీనిపై అధికారులు స్పందించి వెంటనే నిర్మూలించాలని వారు కోరారు.

### శివాలయం ఆవరణలో స్వచ్ఛ భారత్



వాజేడు: మండల కేంద్రంలోని శివాలయం ఆవరణ, పరిసర ప్రాంతాల్లో వాజేడు యూత్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివాలయం ఆవరణలో ఉన్న చెత్త చెదారం తొలగించడంతోపాటు పిచ్చి మొక్కలు, పెద్ద చెట్లను తొలగించారు. కార్యక్రమంలో ఓలేటి పవన్, మాసారపు అశోక్, ఎస్‌కే సన్ని, బద్దెల నాగేంద్ర, దేవులపల్లి హరిబాబు, ముత్తాల చందు, తంగేళ్లపల్లి సిద్దు, చింత శ్యామ్‌ల, పోలిసెట్టి రోహిత్, ఓలేటి జయరాజ్ తదితరులు ఉన్నారు.

# నష్టాల మంట

- పొలాల్లో వ్యర్థాలకు నిప్పు పెడుతున్న రైతులు
- భూసారం దెబ్బతింటుందంటున్న నిపుణులు
- నేలలో కలియదున్నాలని సూచన

టేకుమట్ల: పంట చేతికిరాగానే రైతులు మరో పంట సాగుచేసే పనుల్లో బిజీ అవుతారు. అయితే భవిష్యత్ నష్టాలను అంచనా వేయకుండా రైతులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా మొక్కజొన్న, వరి పంటలు పూర్తయ్యాక వరి పొలంలోని పశుగ్రాసాన్ని పశువులు ఉన్న రైతులు మాత్రమే నిల్వ చేసుకుంటుండగా.. మిగతా రైతులు మాత్రం పొలంలోనే కాల్చేస్తున్నారు. ఇక మొక్క జొన్న రైతులు పూర్తిగా పంటపొలంలోనే దహనం చేస్తున్నారు. యాసంగిలో జిల్లాలో రైతులు సుమారుగా 10వేలకు పైగా ఎకరాల్లో మొక్కజొన్న, వరి పంటను సుమారు 52వేల ఎకరాల్లో సాగు చేశారు. మరో నెల రోజుల్లో పంటకాలం పూర్తి కావస్తున్న తరుణంలో పంటల వ్యర్థాలకు నిప్పు పెడితే కలిగే నష్టాలపై రైతులకు ముందస్తుగా వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

### భూమిలో కలియదున్నాలి..

పంట పూర్తయ్యాక వరి పొలంలోనే కలియదున్నడం వల్ల నేలలో సేంద్రియ కర్బన శాతం పెరడంతోపాటు, సుమారు ఎకరాకు టన్ను ఎరువు తయారవుతుంది. తద్వారా సుమారుగా 5 నుంచి 10శాతం పంట దిగుబడి పెరిగే అవకాశం ఉంది. దుక్కి దున్నే సమయంలో సూపర్ పాస్ఫేట్ చల్లితే పంట అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలుగా రూపాంతరం చెంది పంటకు సేంద్రియ ఎరువుగా మారుతుంది. దాని ద్వారా పంటలో డీఏపీ వాడం సగం వరకు తగ్గుతుంది. అంతే కాకుండా మొక్కలకు 2శాతం నత్రజని, 4శాతం పాస్ఫరస్ అదనంగా లభిస్తుంది. జింక్, మాంగనీస్, క్యాల్షియం, ఐరన్ వంటి సూక్ష్మదాతువులు అంది పంటకు మేలు చేకూర్చడంతో పాటు నీటి నిల్వ పెరుగుతుంది. వరి కొయ్యలను భూమిలో కలియ దున్నితే పోషకాలు తిరిగి నేలకు చేరుతాయి. పొలం దున్నే ముందే ఎకరాకు 50కిలోల సూపర్ పాస్ఫేట్‌ను చల్లితే సేంద్రియ పదార్థాల స్థాయిని పెంచుకునే అవకాశం ఉంటుంది.

### నిప్పు ముప్పే..

వరి కొయ్యలు, మొక్కజొన్న పంటలకు నిప్పు పెట్టడం వల్ల వాతావరణ కాలుష్యం పెరగడంతోపాటు, అత్యధిక ఉష్ణోగ్రతతో నేల భూసారాన్ని కోల్పోతుంది. ముఖ్యంగా భూమిలో ఉండే నత్రజని, పాస్పరస్ వంటి పోషక పథార్థాలతో పాటు,



కాల్చిన వరికొయ్యలు (ఫైల్)

పంట దిగుబడి తగ్గిపోతుంది. అలాగే భూమికి పీచు పథార్థంగా ఉపయోగపడే అవశేషాలు కూడా కాలిపోతాయి. అంతే కాకుండా పంటకు మేలు చేసే ఖనిజ లవణాలు కాలిపోవడంతోపాటు.. సూక్ష్మజీవులు చనిపోతాయి. అలాగే మంటలకు మేలు చేసే వివిధ రకాల జీవులు సైతం మృత్యువాతపడే ప్రమాదం ఉంది.

### అగ్ని ప్రమాదాలకు అవకాశం

వరి కొయ్యలు, మొక్కజొన్న వ్యర్థాలను, గెట్లపై ఉన్న చెత్తను తొలగించేందుకు రైతులు మంటలను అంటించగా అవి కాలుతూ ఇతరుల పంటలను అంటుకోవడం వంటి ఘటనలు జరిగిన సందర్భాలు ఉన్నాయి. ఈక్రమంలో పలుచోట్ల రైతులు సైతం అగ్ని ప్రమాదాలకు గురై గాయాల పాలయ్యే ప్రమాదం ఉంది.

### గంధకం, పాస్పరస్ గాల్లోకి..



పంట వ్యర్థాలను కాల్చివేయడం మూలంగా నేలలోని మంటల్లో గంధకం, పాస్పరస్ గాల్లో కలిసి ఉప్పు మాత్రమే మిగులుతుంది. అంతే కాకుండా రైతుల పంటలకు పరోపకారిగా ఉపయోగపడే జీవులు, ఇతర జీవరాశులు సైతం మంటల్లో చలిపోతాయి. అలాంటప్పుడు పంటలకు సరిపడా ఎరువులను అందిస్తేనే దిగుబడి వస్తుంది. కావున పంట వ్యర్థాలను తగలబెడితే వ్యర్థం, మురగబెడితే లాభం. సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– వీరునాయక్, జిల్లా వ్యవసాయాధికారి

### అవగాహన కల్పిస్తున్నాం..



పాడి రైతులు ఎక్కువగా లేకపోవడం మూలంగా వరి రైతులు పశుగ్రాసాన్ని పొలాల్లోనే కాల్చేస్తున్నారు. పంటలను పొలాల్లో కాల్చేయడం వల్ల కలిగే నష్టాలపై రైతులకు నిత్యం అవగాహన కల్పిస్తున్నాం. దానికి తోడు కూలీల కొరత కూడా ప్రధాన సమస్యగా మారింది. పంటలను కాల్చేయడం వల్ల నేలలోని కర్బన రసాయనాలు పూర్తిగా నిర్వీర్యం కావడంతో నేల సారవంతం క్షీణించి పోతుంది. పంట వ్యర్థాలను దుక్కిలోనే కలియ దున్నాలి.

–మేరుగు కల్యాణి, మండల వ్యవసాధికారి, టేకుమట్ల

## ఏఐ బోధనతో అభ్యసన సామర్థ్యం పెంపు

- డీఈఓ రాజేందర్

కాటారం: ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ)తో విద్యాబోధన కొనసాగించడం ద్వారా విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందుతాయని జిల్లా విద్యాధికారి రాజేందర్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం నూతనంగా శ్రీకారం చుట్టిన ఏఐ విద్యాబోధన ల్యాబ్‌ను కాటారం మండలంలోని చింతకాని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేయగా డీఈఓ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఏఐ విద్యాబోధన ద్వారా విద్యార్థుల్లో సబ్జెక్ట్ పట్ల పూర్తి అవగాహన పెంపొందుతుందని వెనుకబడిన విద్యార్థుల్లో వారి అభ్యసన సామర్థ్యాలను ముందుకు తీసుకెళ్లడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అర్థవంతమైన విషయబోధన చేపట్టడానికి ఏఐ విద్యాబోధన ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. భావనలను పెంపొందించడానికి ఈ బోధన మరింత సమర్థవంతంగా, సృజనాత్మకంగా పని చేస్తుందన్నారు. ఏఐ విద్యాబోధన పాఠశాలల్లో తప్పనిసరిగా కొనసాగించాలని ప్రతి విద్యార్థిలో అభ్యసన సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీదేవి, ఏఎంఓ లక్ష్మణ్, ప్రధానోపాధ్యాయురాలు శైలజ, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం దేవునాయక్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటి చైర్మన్ చంద్రకళ, విఓఏ పద్మ, ఉపాధ్యాయులు గండు రాజబాబు, శారద, రవీందర్, జయరాజ్, రాజారాం, తదితరులు పాల్గొన్నారు.



ఏఐ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న డీఈఓ రాజేందర్

## ప్రభుత్వ పాఠశాలకు క్రీడా పరికరాల అందజేత

మొగుళ్లపల్లి: మండలంలోని మొట్లపల్లి, మొగుళ్లపల్లి ఉన్నత పాఠశాలలకు కోలిన్స్ ఏరోస్పేస్ సంస్థ ఆధ్వర్యంలో క్రీడా పరికరాలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి పోలిలేని రామారావు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల చదువుకునే విద్యార్థుల సౌకర్యార్థం సంస్థ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని తెలిపారు. దానిలో భాగంగా గ్రామీణ విద్యార్థులు క్రీడల్లో రాణించాలనే ఉద్దేశంతో పాఠశాల విద్యార్థులకు పరికరాలను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి లింగాల కుమారస్వామి, ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు భాగ్యశ్రీ ఉపాధ్యాయులు వెంకన్న, కల్యాణి, రాజయ్య, శ్రీకాళ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మొట్లపల్లిలో సామగ్రి అందజేస్తున్న దాతలు

## మిర్చి తోటల్లో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్

వాజేడు: మండల పరిధిలోని చెరుకూరు గ్రామ సమీపంలోని మిర్చి తోటల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కార్యక్రమాన్ని వైద్యాధికారి నవీన్, వైద్య సిబ్బందితో శనివారం కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా మిర్చితోటల్లో పనులు చేస్తున్న వలస కూలీలకు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు నీటిలో ఎంత మోతాదులో కలుపుకొని తాగాలని విషయాన్ని బాటిల్‌లో కలిపి చూపించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.



కూలీలకు జాగ్రత్తలు వివరిస్తున్న వైద్య సిబ్బంది

## 'ఎస్సీ వర్గీకరణ చేస్తేనే ఉద్యోగులకు న్యాయం'

ఏటూరునాగారం: రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఎస్సీ వర్గీకరణ చట్టం చేయకుండా ఉద్యోగ నియామకాలు చేపట్టి మాదిగ, ఉప కులాలకు అన్యాయం చేసే విధంగా చూస్తుందని వికలాంగుల హక్కుల పోరాట సమితి( వీహెచ్‌పీఎస్) అధ్యక్షులు బానోత్ బద్రునాయక్, ఆదివాసీ జిల్లా అధ్యక్షుడు వట్టం జనార్దన్ అన్నారు. ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులతో చేపట్టిన దీక్షలో గిరిజన సంఘం, ఆదివాసీ సంఘం నాయకులు శనివారం మద్దతు పలికారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇకనైనా రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు గౌరవ రేవంత్ రెడ్డి మాదిగలపై కక్ష సాధింపుగా ఉన్నారని అన్నారు. ఉద్యోగాల విషయంలో ఇప్పటికైనా వెనుకకు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వావిలాల స్వామి, జాషువ, లక్ష్మీకాంత, అనసూర్య, సురేష్, సతీష్ పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న నాయకులు

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

వాజేడు: మండల పరిధిలోని పాయబాటల గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రేకుల ఇల్లు దగ్ధమైన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం సంఘటన వివరాలిలా ఉన్నాయి. పాయబాట గ్రామానికి చెందిన పుష్పవతికి చెందిన రేకుల ఇంట్లో విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయని తెలిపారు. గమనించిన గ్రామస్తులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినా.. ఫలితం లేకుండా పోయింది. ఈ ప్రమాదంలో దుస్తులు, సర్టిఫికెట్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయని తెలపారు. సుమారు రూ.1.5లక్షల నష్టం వాటిల్లినట్లు తెలిపారు.

## పోచమ్మ ఆలయ నిర్వహణపై వివాదం

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని గణేష్ చౌక్ సమీపంలో ప్రధాన రహదారి గల పోచమ్మ గుడి ఆలయ నిర్వహణల్లో రజక కులస్తులు గొడవ పడ్డారు. కులస్తులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొన్నేళ్లుగా ఈ గుడిలో గోపరాజు సాంబలక్ష్మి అనే మహిళ సేవలందిస్తోంది. ఈ క్రమంలో కులస్తులంతా ఏకమై ఆలయంలో సేవలందించేందుకు వేలం నిర్వహించారు. ఈ వేలంలో ఓరుగంటి లక్ష్మి వేలం దక్కించుకుంది. ఈ నేపథ్యంలో కొన్నేళ్లుగా సేవలందిస్తున్న తనకే అవకాశం ఇవ్వాలని, తన ఆరోగ్యం బాగాలేదని సాంబలక్ష్మి పలుమార్లు కోరుకుంది. దీంతో వేలం ద్వారానే అన్ని గుడులకు సేవ చేసే అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. దీంతో గత ఐదు రోజులుగా సాంబలక్ష్మి అదే ఆలయం వద్ద నిరాహార దీక్ష చేస్తుంది. ఈ క్రమంలో కులస్తులు శనివారం గుడి వద్దకు వెళ్లి సంఘం నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించగా ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. రెండు వర్గాలుగా ఏర్పడి ఒకరిపై ఒకరు దూషణలు చేసుకొని ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో సాంబలక్ష్మికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు.

## కాన్షీరాం జయంతి వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ధర్మసమాజ్ పార్టీ నాయకులు

భూపాలపల్లి రూరల్: ధర్మసమాజ్ పార్టీ భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాన్షీరాం 91వ జయంతి వేడుకలతోపాటు ధర్మ సమాజ్ పార్టీ 2వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో శనివారం జిల్లా ఉపాధ్యక్షుడు చిట్యాల శ్రీనివాస్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు కండే రవి, మంద రమేష్, మహర్షి, జిల్లా నాయకులు బొజ్జపల్లి మహర్షి, నాయకులు బోయిని జగన్, వివిధ మండలాల అధ్యక్షులు, నాయకులు కోరాళ్ల శ్యామ్, కుర్రి స్వామి, దూడపాక రాజు, నరసింహ, బండారి దశరథం, బండారి కుమార్, పంగ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాణ స్వీకారం

వెంకటాపురం(కె): నూగూరు వ్యవసాయ కమిటీ డైరెక్టర్లుగా మండలానికి చెందిన యాలం సాయి, పాయం వెంకట్రామయ్య ఎన్నికయ్యారు. కాగా శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాయలంలో వీరు ప్రమాణ స్వీకారం చేశారు.

## మేడిపల్లి అడవిలో కార్చిచ్చు..

కాటారం: మండలంలోని మేడిపల్లి సమీపంలో గల అటవీప్రాంతంలో బుధవారం రాత్రి కార్చిచ్చు చెలరేగింది. ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని అడవిలో కొంత భాగం మంటలు వ్యాపించాయి. చెత్త తోపాటు చిన్న చిన్న చెట్లు మంటల్లో కాలిపోయాయి. మంటలు భారీగా విస్తరించడంతో అటువైపు వెళ్లిన వారు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో వారు సంఘటనా స్థలానికి చేరుకొని బ్లోయర్ల సాయంతో మంటలు ఆర్పారు.



అడవిలో అంటుకున్న మంటలు

## పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

రేగొండ : పోషకాలతో కూడిన ఆహారం తీసుకుంటేనే గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. శనివారం కొత్తపల్లిగోరి మండలంలోని కొత్తపల్లి (బి) గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో రుద్రారపు ప్రియాంక ఆధ్వర్యంలో బాలింతలకు శీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ రమాదేవి మాట్లాడుతూ ... మహిళల ఆరోగ్య రక్షణ కోసం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిశువుకు తల్లి పాలు ఎంతో శ్రేయస్కరమని, ఆరు నెలల వరకు బిడ్డకు తల్లిపాలు పట్టించాలని సూచించారు. గ్రామంలోని ప్రతి లబ్ధిదారులు అంగన్‌వాడీ సేవలను వినియోగించుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఆయా స్వప్న, గ్రామస్తులు రజిత, శిరీష, శ్రావ్య, వర్షిత, స్వప్న, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



సీమంతం చేస్తున్న సూపర్‌వైజర్ రమాదేవి

## కనుకయ్యగౌడ్ మృతి తీరని లోటు



చిట్యాల: బుర్ర కనుకయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నిశిధర్‌రెడ్డి



రేగొండ: పరామర్శిస్తున్న నిషిధర్‌రెడ్డి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిశిధర్‌రెడ్డి

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన బుర్ర కనుకయ్య గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆయన కుటుంబ సభ్యులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతల నిశిధర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. కనుకయ్య చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బుర్ర కనుకయ్యగౌడ్ జనసంఘ్ నుంచి భారతీయ జనతా పార్టీ ఆవిర్భావం వరకు ఎన్నో సేవలు చేశారని గుర్తు చేశారు. ఆయన వెంట పార్లమెంటరీ కో-కన్వీనర్ లింగంపల్లి ప్రసాద్ రావు, పార్టీ నాయకులు ఉన్నారు.

**ఆర్థిక సాయం**

మండలంలోని కైలాపూర్ శివారు శాంతినగర్ గ్రామానికి చెందిన మోత్కూరి కుమారస్వామి ఇటీవల పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో శ్రీలక్ష్మీనరసింహ అసోసియేషన్ డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.15వేలు అందజేశారు. కార్యక్రమంలో డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు ఈర్ల సహోదర్, ప్రధాన కార్యదర్శి జెట్టి రమేష్, జంబుల రాజు, అన్నరాజు, కన్నవేణి రాయకోంరు, చిక్కుల నరేష్, పర్లపెల్లి రాజ్‌కుమార్, బోడ నరేందర్ తదితరులు ఉన్నారు.

రేగొండ: మండలంలోని లింగాల గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు ఎర్రం సదాశివుడు తండ్రి ఎర్రం కైలాసం ఇటీవల మరణించారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను శనివారం ఆ పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషిధర్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు పెండ్యాల రాజు, ముష్క నరేందర్, తూర్పాటి మల్లేష్, సామాల సంతోష్, ఎర్రబట్టి శివ కృష్ణ, అంబటి రాజుకుమార్ ఉన్నారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

రేగొండ: విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని పాఠశాలలో రిటైర్డ్ టీచర్ రాఘువులు పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి, సర్టిఫికెట్ ఫైల్స్ అందజేశారు. పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించే విద్యార్థులకు నగదు పురస్కారం అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణకుమారి మాట్లాడుతూ.. రాఘవులు పాఠశాలలోని అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గత కొన్ని సంవత్సరాలుగా సర్టిఫికెట్లు, జ్ఞాపికలు, నగదు ప్రోత్సాహకం అందజేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవేందర్, సంధ్యారాణి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, రాధాకృష్ణ, సాంబశివుడు, సునీత, శారద, జ్యోతి, గీత తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న రాఘవులు

## వినియోగదారులకు హక్కులు, బాధ్యతలు

భూపాలపల్లి రూరల్: వినియోగదారులకు హక్కులతోపాటు బాధ్యతలుకూడా ఉంటాయని జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, డీఆర్‌డీఓ నరేష్ తెలిపారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలో ప్రపంచ వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాణ్యమైన ఉత్పత్తులు, సరైన ధర, భద్రతా ప్రమాణాలు కలిగిన వస్తువులు పొందడం వినియోగదారుల హక్కు అని, వస్తువుల పట్ల అవగాహన కలిగి విక్రయాల్లో మోసాలను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యతని గుర్తు చేశారు. వినియోగదారుల హక్కులను పరిరక్షించేందుకు అనేక చట్టాలున్నప్పటికీ, ప్రజలు తమ హక్కులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం వినియోగదారుల హక్కులు, నాణ్యమైన వస్తువులు, వస్తు తూకములో అక్రమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే 'స్థిరమైన జీవనశైలికి ఒక సరైన పరివర్తన' అంశం మీద క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వీరునాయక్, డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ రవి రాథోడ్, లీగల్ మెట్రాలజీ టెక్నికల్ అసిస్టెంట్ రాజగోపాల్, డీఈఓ కార్యాలయ ప్లానింగ్ కో-ఆర్డినేటర్ మల్లయ్య, డీలర్స్ అసోసియేషన్ నుంచి రాధాకృష్ణ, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

## కారుణ్య నియామక ఉత్తర్వుల అందజేత



కారుణ్య నియామక పత్రాలు అందుకున్న ఉద్యోగులతో అధికారులు

భూపాలపల్లి అర్బన్: ఏరియాలోన సింగరేణి కారుణ్య నియమాక పద్ధతిలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు శనివారం నియామక పత్రాలు అందజేశారు. ఏరియాలోని జీఎం కార్యాలయంలో జీఎం రాజేశ్వర్‌రెడ్డి 26మందికి నియామక పత్రాలు అందజేశారు. సంస్థ అభివృద్ధికి క్రమశిక్షణతో పనిచేసి ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని జీఎం సూచించారు.

## డ్రైవింగ్ కోర్సులో ఉచిత శిక్షణ

భూపాలపల్లి రూరల్: ఉచిత డ్రైవింగ్ కోర్సులో శిక్షణ కోసం నిరుద్యోగ బీసీ యువతీ యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి శైలజ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గలవారు నేటినుంచి ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా వెనుకబడిన తరగతుల కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.